

'గులాబీ'కి.. గుడ్‌బై!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

అటు అసెంబ్లీ.. ఇటు పార్లమెంట్ ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో 'గులాబీ' పార్టీకి కీలక నేతలు గుడ్‌బై చెబుతున్నారు. వరుస ఓటములతో నారాజ్‌లో ఉన్న బీఆర్ఎస్ నేతలు తమ రాజకీయ భవిష్యత్ పేరుతో ఒక్కొరొక్కరుగా కారు దిగి.. 'హస్తం' అందుకుంటున్నారు. ఇప్పటికే ఆ పార్టీ కీలక నేతగా ఉన్న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ మేయర్ గుండు సుధారాణితో పాటు పలువురు కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో తన సొంతగూటికి చేరుకున్నారు. ఇక ఆయన దారిలోనే మండలి వైస్‌చైర్మన్‌తో పాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరుగుతున్నాయి. దీంతో ఓరుగల్లులో బీఆర్ఎస్‌ను ఖాళీ చేయాలన్న కాంగ్రెస్ లక్ష్యం నెరవేరుతుందనే చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. అసలు ఓరుగల్లుకు చెందిన కాంగ్రెస్ నేతలతో చర్చకుండానే చేరికల పర్వం నిర్వహిస్తుండటం ఆ పార్టీలో కొత్త చర్చకు, చిక్కులకు దారితీస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కారు దిగుతున్న గులాబీ నేతలు..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి మూడో స్థానంలో నిలవటంతో గులాబీ నేతలు తీవ్ర నిరాశనిస్పృహల్లో ఉన్నారు. దీనికి తోడు ఇటీవల జరిగిన వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలోనూ ఓటమితో అధిష్ఠానం పెద్దలు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న అసంతృప్తి గులాబీ నేతల్లో వ్యక్తమవుతోంది. వరంగల్ ఎంపీ అభ్యర్థితో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికలో ఓరుగల్లు నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఒకరిద్దరు చెప్పిన మాటలను విశ్వసించి అభ్యర్థుల ఎంపిక చేశారని గులాబీ నేతలు గుర్రుగా ఉన్నారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతల్లో తమ భవిష్యత్తుపై అభద్రతా భావం ఏర్పడిందనే చర్చ జరుగుతుండగా.. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే చందంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల ముందు స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి తన కూతురు కావ్యతో కలిసి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి కూడా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఒత్తిడి తట్టుకోలేక కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారనే చర్చ జరుగుతోంది. ఇక డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు కూడా కాంగ్రెస్‌లో చేరి రాష్ట్ర టెస్కాబ్ చైర్మన్‌గా పదోన్నతి పొందారు. వీరితో పాటు చాలా చోట్ల బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి మునిసిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. వరంగల్ నగరానికి చెందిన 20మందికి పైగా కార్పొరేటర్లు కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. ఈ వలసలు ఇప్పట్లో ఆగేలా లేకపోవటం గులాబీ దళాన్ని కలవరపెడుతోంది.

- అదేదారిలో మండలి వైస్ చైర్మన్, మరో ఇద్దరు ఎమ్మెల్సీలు
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మేయర్ సుధారాణి
- వరుసగా బీఆర్ఎస్‌ను వీడుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలు
- వలస నేతల రాకతో అధికారపార్టీలోనూ అలజడి
- స్థానిక నాయకత్వానికి సమాచారం ఉండటంలేదని చర్చ

కారు దిగి 'హస్తం' అందుకున్న ఎమ్మెల్సీ సారయ్య



సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

సొంతగూటికి చేరిన సారయ్య

శాసనమండలిలో మెజార్టీ లేకపోవటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకునేందుకు 'ఎమ్మెల్సీ ఆకర్ష్'కు కాంగ్రెస్ చేస్తున్న కసరత్తు విజయవంతంగా సాగుతోంది. గురువారం అర్ధరాత్రి ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. వారిలో వరంగల్‌కు చెందిన మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కూడా ఉన్నారు. గత నెల 29న సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు వచ్చినప్పుడే సారయ్య చేరిక దాదాపు ఖరారైంది. ఆ రోజున సీఎం ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో సారయ్య కలెక్టరేట్‌లోనే చర్చలు జరిపారు. అనూహ్యంగా గురువారం సచివాలయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు హాజరైన ఆయన రాత్రికి రాత్రి కాంగ్రెస్ కండువా కప్పుకోవటంతో గులాబీ శ్రేణులు నివ్వెరపోయాయి. మొదటి నుంచి కాంగ్రెస్‌వాదిగా ఉన్న బస్వరాజు సారయ్య కాంగ్రెస్ హయంలో మంత్రిగా కూడా పని చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురామిరెడ్డి పేరు ఖరారు కాగానే, సారయ్య ఖమ్మం వెళ్లి రామసహాయం కుటుంబాన్ని కలిసి వచ్చారు. అప్పట్లోనే కాంగ్రెస్‌లో సారయ్య చేరతారనే చర్చ జరిగింది. అయితే తాను మర్యాదపూర్వకంగానే రామసహాయం రఘురామిరెడ్డిని కలిసినట్లు నాడు సారయ్య వివరణ ఇచ్చారు. వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి శిష్యుడిగా రాజకీయాల్లో రాణించిన సారయ్య.. మళ్లీ రామసహాయం కుటుంబం కాంగ్రెస్‌లో కీలకంగా మారటంతో బస్వరాజు సారయ్య కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లారని సమాచారం. 2026 నవంబరు31వ తేదీ వరకు బస్వరాజు సారయ్య ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కానుంది.

క్యూలో మరో ముగ్గురు ఎమ్మెల్సీలు?

బస్వరాజు సారయ్యతోనే ఎమ్మెల్సీల వలసలకు బ్రేక్ పడేలా లేదనే చర్చ జరుగుతుంది. శాసనమండలి వైస్‌చైర్మన్ బండా ప్రకాష్ కూడా కాంగ్రెస్ గూటికి చేరుతారనే చర్చ జరుగుతుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డితో ప్రకాష్ చర్చలు జరిపారని, మండలి వైస్‌చైర్మన్‌గా రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న కారణంగా ఆయన పార్టీ కండువా కప్పుకోవటం కుదరదనే ప్రచారం జరుగుతోంది. బండా ప్రకాష్‌తో పాటు ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావును ఆకర్షించేందుకు కాంగ్రెస్ వైపు నుంచి ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. మంత్రిగా పని చేసిన సత్యవతిరాథోడ్‌ను పార్టీలో తీసుకొచ్చేందుకు ఓ సీనియర్ ఎమ్మెల్యే తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, మరో విడత చేరికలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు చేరడం పక్కా అనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు జనగామ ఎమ్మెల్యేతో పాటు ఆరుగురు ఎమ్మెల్సీలున్నారు. వీరిలో సారయ్య కాంగ్రెస్‌లో చేరగా, బండా ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు కూడా కాంగ్రెస్‌లో చేరితే బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టమేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒక్కొక్కరు కారు దిగి టాటా చెప్పి కాంగ్రెస్‌లో చేరుతుండటంతో గులాబీ కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లో చేరికల టెన్షన్..

కాంగ్రెస్‌లో గులాబీ నేతల చేరికలతో స్థానిక నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కీలక నేతలు పార్టీలో చేరుతున్న వేళ స్థానిక నాయకత్వానికి సమాచారం ఉండటం లేదనే చర్చ పార్టీలో జరుగుతోంది. ఈ పరిణామాలపై నేతలు పైకి స్పందించకపోయినా లోలోపల ఒకింత నారాజ్‌గానే ఉంటున్నారని తెలుస్తోంది. ఇందుకు ఉదాహరణగా వరంగల్ మేయర్ గుండు సుధారాణి చేరిక అంశాన్ని ప్రస్తావిస్తున్నారు. ఆమెను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని పలువురు నేతలు అడ్డుకున్నా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. ఇక ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చేరిక సందర్భంలోనూ వరంగల్‌కు చెందిన మంత్రులు లేకపోవటం జిల్లా రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఇద్దరు నేతలు కూడా వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రభావం చూపే నేతలే కావటంతో పాత కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. నేతలతో పాటు వారి కేడర్ కూడా కాంగ్రెస్‌లోకి వస్తుండటంతో భవిష్యత్తులో తమ పదవులకు ఎక్కడ అడ్డు వస్తారోననే ఆందోళనలో కిందిస్థాయి నేతలున్నారు. మొత్తానికి ఓరుగల్లులో బీఆర్ఎస్‌ను ఖాళీ చేసే పనిలో కాంగ్రెస్ అధిష్ఠానం నిమగ్నమవగా.. చేరికల పర్వంతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు ఎటు దారితీస్తాయోనన్న చర్చ జరుగుతోంది.

మానవ మనుగడకు చెట్లే ఆధారం

మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలి: వన మహోత్సవంలో కలెక్టర్, ఎమ్మెల్యే



వర్ధన్నపేటలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే

వర్ధన్నపేట, జూలై5: మానవాళి మనుగడకు చెట్లే జీవనాధారమని కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజులు అన్నారు. శుక్రవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని మునిసిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైమొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని కోరారు. గ్రామాల్లో వీలైనంత వరకు పండ్ల మొక్కలు అందించాలన్నారు. కార్య క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ, వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కమిషనర్ ఇసంపల్లి జోనా, తహసీల్దార్ విజయ సాగర్, కౌన్సిలర్లు పాలకుర్తి సుజాత, సమ్మెట సుధీర్‌గౌడ్, నాయకులు ఎద్దు సత్యనారాయణ, కృష్ణారెడ్డి, మైస సురేష్‌కుమార్, పాలకుర్తి సారంగపాణి, సిలువేరు శ్రీధర్ పాల్గొన్నారు.

- వర్ధన్నపేట రూరల్: రాష్ట్రం పచ్చగా ఉండాలంటే మొక్కల్ని సంరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరు తీసుకోవాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా కొత్తపెల్లి గ్రామం నుంచి ఇల్లంద వరకు ఏర్పాటు చేసిన మెగా ప్లాంటేషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు వైపులా మొక్కలు నాటారు. కార్యక్ర మంలో జిల్లా డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, జడ్పీ సీఈవో జి.రామ్‌రెడ్డి, డీఆర్డీవో కౌసల్యా దేవి, మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ విజయ్‌సాగర్, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఎంపీవో ధనలక్ష్మి పాల్గొన్నారు.
- నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే బాధ్యత తప్పనిసరిగా తీసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరా జు సూచించారు. కొత్త పెల్లి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు చెట్లను సైతం పెంచి భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న, తాళ్ల పెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని బలిగొన్న వేగం

దంతాలపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- కారు - ఆటో ఢీకొనడంతో ముగ్గురి మృత్యువాత
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- ఎంజీఎంలో చికిత్స.. పరిస్థితి విషమం

మృతులు



ఆటోడ్రైవర్ బందు మల్లేష్, పగిండ్ల కొమురయ్య, భూక్య నరేష్

దంతాలపల్లి(మహబూబాబాద్ జిల్లా), జూలై 5: మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి 365పై జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శుక్రవారం రాత్రి 8గంటల ప్రాంతంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తొర్రూరు నుంచి ప్రయాణికులతో కూడిన ఆటో మరిపెడకు వెళుతోంది. ఇందులో డ్రైవర్‌తోపాటు ఐదుగురు ప్రయాణిస్తున్నారు. అలాగే మరిపెడ నుంచి దంతాలపల్లికి కారు వస్తోంది. ఈ క్రమంలో దంతాలపల్లి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కారు - ఆటోలు వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో రెండు భాగాలుగా విడిపోగా, తొర్రూరు మండలం వెల్లికట్టకు చెందిన ఆటోడ్రైవర్ బందు మల్లేష్ (35), దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెంకు చెందిన పగిండ్ల కొమురయ్య (38) అక్కడికక్కడే మృతి చెందాడు. కొమురయ్య భార్య మంజుల (30), కూతురు అంజలి(15) కూడా ఆటోలో ప్రయాణిస్తుండగా తీవ్రగాయాలయ్యాయి. వీరితో పాటు తీవ్రగాయాలపాలైన మహబూబాబాద్ మండలం ఆమనగల్‌కు చెందిన అక్షయ (19), దంతాలపల్లి మండలం వాల్యతండా గ్రామానికి చెందిన భూక్య నరేష్ (30)లను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా భూక్య నరేష్ మార్గమధ్యంలో మృతి చెందాడు. కాగా, ప్రమాద విషయం తెలిసిన వెంటనే తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ, తొర్రూరు ఎస్సై జగదీష్, దంతాలపల్లి ఎస్సై కరుణాకర్ తదితరులు సంఘటనాస్థలానికి వెళ్లారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేశారు. కాగా, ప్రమాద స్థలంలో కారు అక్కడే ఉండగా డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదానికి గల సమాచారం పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితులు



నుజ్జునుజ్జు అయిన ఆటో



ప్రమాదం జరిగిన కారు

ఎంజీఎంలో క్షతగాత్రులు

వరంగల్ మెడికల్: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రం సమీపంలోని ఖమ్మం- వరంగల్ ప్రధాన రహదారి వద్ద శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి ఎంజీఎంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కారు - ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటోడ్రైవర్ బందు మల్లేష్, పగిండ్ల కొమురయ్య, భూక్య నరేష్ మృతిచెందగా, గాయపడ్డ కొమురయ్య భార్య మంజుల, కూతురు అంజలి, మరో యువతి అక్షయలను స్థానికులు 108 వాహనంలో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

సామాజిక సమీకరణ మేళవింపు



రిజిస్ట్రార్ మల్లారెడ్డిని కలిసిన ఈసీ సభ్యులు

- ఎట్టకేలకు కేయూ ఈసీ నియామకం
- కేయూ పాలక మండలిలో అన్నివర్గాలకు ప్రాధాన్యత
- మూడేళ్లపాటు పదవీ కాలం
- వీసీ నియామకంలో కీలకపాత్ర
- మండలి ఎదుట సవాళ్లు ఎన్నో..

7



నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు

- 21 వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- ముస్తాబైన భద్రకాళి ఆలయం..
- దేశ నలుమూలల నుంచి రానున్న భక్తులు

7

ఆషాఢం జోష్..

- బోనాలు, శాకంబరీ సందడి..
- ప్రత్యేక పూజలకు ఆలయాలు ముస్తాబు
- పండుగలు, ఆధ్యాత్మికతకు ప్రత్యేకం..
- నేటి నుంచి ఆషాఢ మాసం ఆరంభం



వరంగల్ కల్చరల్, జూలై 5: నేటి నుంచి (శనివారం) ఆషాఢ మాసం ప్రారంభం కానుంది. ఆషాఢ మాసానికి ప్రత్యేకత ఉంది. ఆషాఢం నుంచే వర్షాకాలం ప్రారంభమవుతుంది.ఈ మాసంలో దేవతామూర్తులకు విశ్రాంతి కాలంగా భావిస్తారు. దీనినే చాతుర్మాస్యం అంటారు. ఆషాఢంలో వివాహాది శుభకార్యాలు తలపెట్టరు. కానీ ఎక్కువగా పూజలు నిర్వహిస్తారు. ఆషాఢం వచ్చిందంటే బోనాల సందడి అంతాఇంతా కాదు. ఏడాదిలో వచ్చే విశేష ఆధ్యాత్మికమైన శాకంబరీ ఉత్సవాలు, గురుపౌర్ణమి వేడుకలు చాతుర్మాస దీక్షలు ఆషాఢంలోనే ప్రారంభ మవుతాయి. ఆషాఢంలో బోనాల జరిగే ఆలయాలను ముస్తాబు చేశారు. శాకంబరి ఉత్సవాలు జరిగే ఆల యాల్లో తగిన ఏర్పాట్లు చేశారు. తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొన సాగుతాయి.

ఆషాఢ మాస ప్రాముఖ్యత..

ఆషాఢ మాసం కోరిన కోర్కెలు నెరవేరే మాసమని నమ్ముతారు. ఈ మాసంలోనే తొలి పండుగ ఏకాదశి వస్తుంది. ఆ రోజు నుంచి శ్రీమహావిష్ణువు యోగా నిద్రలోకి వెళ్తారని పురాణాలు చెబుతున్నాయి. ఆషాఢంలో అమ్మవారికి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం వలన కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని హిందువులు నమ్ముతారు. అలాగే ఆషాఢంలో బోనాలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఏడాదిలో వచ్చే మొదటి పండుగగా తొలి ఏకాదశిని పిలుస్తారు. తొలి ఏకాదశి పండుగతోపాటు అమ్మ వారికి గుప్త నవరాత్రులు, శాకంబరి ఉత్సవాలతో పాటు గురుదేవులకు ప్రీతికరమైన గురుపౌర్ణమి వైభవంగా జరుగుతాయి.

వన భోజనాలు షురూ..

ఆషాఢం వచ్చిందంటే వనభోజనాల సందడి నెలకొంటుంది. వన భోజనాలకు ప్రత్యేకంగా వెళ్తారు. కొత్త కోడళ్లకూ పండగే. కొత్తగా పెళ్లైన పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి వెళ్తారు. అత్తవారి ఇంటికాడ ఉండకూడదని, అత్తముఖం చూడొద్దని అనాదిగా వస్తున్న ఆచారం. కొత్త అల్లుళ్ల కూడా అత్తవారి ఇంటికి పిలవరు.



ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలి..

● వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయవాదులు ● కోర్టు ఎదుట ర్యాలీ, ధర్నా



కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 5: భావ ప్రకటన స్వేచ్ఛను హరించి వేసే ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. కోర్టు నుంచి గేటు వరకు ర్యాలీగా చేరుకొని ధర్నా నిర్వహించారు. ఇటీవల సవరణ చేసి అమలులోకి తెచ్చిన ఐపీసీ చట్టాన్ని భారతీయ నాగరిక్ సురక్షా సంహితగా (బీఎన్ఎస్ఎస్), సీఆర్‌పీసీని భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ చట్టాన్ని భారతీయ సాక్షా సంహిత (బీఎస్‌ఏ)గా పేర్లు మార్చి వ్యక్తి స్వేచ్ఛను, నిరసన తెలిపే హక్కును కాలరాస్తోందని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ పేర్కొన్నారు. కనీసం చర్చ లేకుండా ప్రతిపక్షాలను ఉభయసభల నుంచి బహిష్కరించి చట్టాలను ఆమోదించిన తీరు అప్రజాస్వామికమని, రాజ్యాంగ విరుద్ధమని ఆయన అన్నారు. పోలీసులకు విస్తృతమైన న్యాయాధికార నిర్ణయాలను కట్టబెడుతూ తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లాడే రమేష్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగే విధంగా చట్టాలను రూపొందించడం నియంతృత్వ పోకడలకు అద్దం పడుతోందని ఆయన అన్నారు. ప్రజా వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని, లేదంటే తీవ్రమైన కార్యాచరణ న్యాయవాదులు చేపడుతారని ఈ సందర్భంగా వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముదసర్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కె.అంబరీష్ రావు, సాంబశివరాజు, జీఆర్ శ్రీనివాస్, విజేందర్, కవిత, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.


అక్షిత్‌ను అభినందిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వండర్ కిడ్‌ను అభినందించిన సీపీ

వరంగల్ క్రైం, జులై 5: పిన్న వయస్సులో ప్రపంచ దేశ రాజధానులు, కరెన్సీల పేర్లు అనర్గళంగా చెబుతూ ప్రతిభ కనబరుస్తున్న డి.అక్షిత్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. కేయూ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా చేస్తున్న దేవేందర్ - స్వప్న దంపతుల కుమారుడు అక్షిత్.. నగరంలోని ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ప్రపంచ దేశ రాజధానులు, ఆ దేశాల కరెన్సీల పేర్లు చూడకుండా ధారాళంగా చెబుతున్న అక్షిత్ ప్రతిభను గుర్తించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలో నమోదు చేసి గుర్తింపుపత్రాన్ని అందించారు. తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి గుర్తింపు పత్రాన్ని అందుకున్న తన కుమారుడు అక్షిత్‌తో కలిసి దేవేందర్ దంపతులు శుక్రవారం పోలీస్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అక్షిత్‌ను కమిషనర్ అభినందించారు.

టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం నాయకులకు ఘన సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, జూలై5: టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్‌లను హనుమకొండ టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా టీఎన్‌జీవో నాయకులు శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎళ్లవేలలా కృషి చేస్తామన్నారు. ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఎవరికీ అన్యాయం జరగకుండా టీఎన్‌జీవోస్ కేంద్ర సంఘం చూస్తోందని, కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా టీఎన్‌జీఓస్ కార్యదర్శి భైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్‌తోపాటు టీఎన్‌జీవోస్ నాయకులు ఉన్నారు.


హైదరాబాద్ నాంపల్లిలో టీఎన్‌జీవోస్ భవన్‌లో కేంద్ర సంఘం నాయకులను సన్మానిస్తున్న హనుమకొండ టీఎన్‌జీఓస్ నాయకులు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

చదివింది ఎంబీఏ.. చేసేది సైబర్ నేరాలు..

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం.. అరెస్టు చేసిన సైబర్ పోలీసులు

వరంగల్ క్రైం, జులై 5: ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన సైబర్ నేరస్థుడిని వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ విభాగం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టు వివరాలను కమిషనరేట్‌లోని సైబర్ క్రైం విభాగం స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ విజయ్‌కుమార్ వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లాకు చెందిన పొనగంటి సాయితేజ ఎంబీఏ పట్టా అందుకుని పలు కంపెనీల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. దీంతో సులభంగా డబ్బు సంపాదించాలని తనకు ఉన్న కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు కల్పించే కొన్ని వెబ్‌సైట్‌లను ఎంపిక చేసుకున్నాడు. పలువురు నిరుద్యోగుల ఫోన్‌నంబర్లు సేకరించి ఉద్యోగాలు కల్పిస్తానని లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు. ఇదే తరహాల్లో వరంగల్‌కు చెందిన ఒక నిరుద్యోగి నుంచి మూడు లక్షలు వసూలు చేశాడు. డబ్బులు తీసుకున్న సాయితేజ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేశాడు. ఆందోళన చెందిన సదరు నిరుద్యోగి.. సైబర్ క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నిందితుడిని సైబర్‌క్రైం స్టేషన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో 35మంది వద్ద రూ.45లక్షల మేరకు వసూలు చేసినట్లు తేలింది. నిందితుడు సైతం డబ్బులు వసూలు చేసినట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్స్‌పెక్టర్లు రవి, ఎస్ఐలు శివ, చరణ్, కానిస్టేబుళ్లు ఆంజనేయులు, మహేందర్, రాజు, సంపత్‌లను కమిషనర్ అభినందించారు.

ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన విద్యాసాగర్‌రావు


చంద్రబాబుతో విద్యాసాగర్‌రావు

హనుమకొండ కలెక్టరేట్, జూలై5: ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ఆయనను టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడు అర్షనపల్లి విద్యాసాగర్ రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వరంగల్ పార్లమెంట్ టీడీపీ నాయకులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతి

వరంగల్ క్రైం, జూలై 5: వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 12 మంది హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన వారిలో ఎన్.గజేందర్, టి.సాయిబాబ, ఎం.యాకయ్య, ఎన్.రఘునాథరెడ్డి, కె.శ్రీనివాస్‌రెడ్డి, ఐ.రాజిరెడ్డి, బీ.యాకయ్య, ఎ.శ్రీనివాస్‌రావు, పి.యాదగిరి, ఆర్.మల్లిఖార్జున్, జి.రవిచందర్, ఎస్.కోటయ్య ఉన్నారు.









చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వరంగల్ క్రైం, జులై 5: కాలుజరి పడి చికిత్స పొందుతూ ఉప్పలయ్య(80) అనే వ్యక్తి మృతి చెందాడు. పర్వతగిరి మండలం అన్నారం గ్రామానికి చెందిన ఉప్పలయ్య అనారోగ్యంతో కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలోని టీబీ హాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈనెల 1వ తేదీన హాస్పిటల్ జారీ పడటంతో గాయాలు కాగా, ఎంజీఎంకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉప్పలయ్య మృతి చెందినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

విద్యార్థి నేతల అరెస్టు

వరంగల్ క్రైం, జులై 5: విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కేయూ పోలీసులు కేయూ విద్యార్థి సంఘ నేతలు 12మందిని అదుపులోకి తీసుకుని సాయంత్రం వదిలేశారు.

8న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీష్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 5: ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీష్ మేళాలో భాగంగా ఈ నెల 8న ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీష్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జూమ్లా నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు www.apprentieshipindia.gov.in అనే వెబ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ మేళాలో హైదరాబాద్‌కు చెందిన కంపెనీలు పాల్గొంటున్నాయని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి ఏప్‌సెట్ కౌన్సెలింగ్

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 5: ఏప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. వరంగల్‌లో నాలుగు కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు హనుమకొండలోని కేడీసీ, సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల, కేయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో సర్టిఫికేట్ల పరిశీలన నిర్వహించనున్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

కేయూ క్యాంపస్, జూలై 5: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు ఇద్దరూ విద్యార్థులను పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహ చారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్. నరేందర్‌లు శుక్రవారం తెలిపారు. డీబారైన వారిలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరూ ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల్లో బదిలీల గుబులు

ఉమ్మడి జిల్లాలోని పలువురు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు స్థానచలనం

ఎంజీఎం సూపరింటెండెంట్ రేసులో పలువురు ప్రొఫెసర్లు

వరంగల్ మెడికల్, జూలై5: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగులకు బదిలీల భయం పట్టుకుంది. కొన్నేళ్లుగా బదిలీలపై నిషేధం ఉండటంతో చాలామంది ఉద్యోగులు హెడ్ క్వార్టర్‌లో తిష్టవేశారు. అనారోగ్యం బారిన పడిన మరికొందరు ఉద్యోగులు బదిలీ కోసం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఇలాంటి వారందరికీ రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబరు 80 పెద్ద ఊరటనిచ్చింది. జూలై 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు బదిలీపై నిషేధాన్ని ఎత్తివేశారు. ఎంజీఎం, జీఎంహెచ్. కాకతీయ వైద్య కళాశాల, సీకేఎం ఆస్పత్రులతోపాటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ప్రధాన కార్యాలయాలు, పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో భారీ ఎత్తున బదిలీలు జరిగే అవకాశం ఉంది. ప్రతీ కేడర్‌లో 40 శాతానికి లోబడి బదిలీలు చేపట్టాలనే నిబంధన కొందరు ఉద్యోగులకు వరంగా మారనుంది. ఇప్పటికేప్రభుత్వం హెచ్‌వోడీల నుంచి ఉద్యోగుల సీనియారిటీ జాబితాను తెప్పించుకుంది.

డీఎంహెచ్‌వో పోస్టుకు భలే డిమాండ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి పోస్టులను దక్కించుకునేందుకు పలువరు సీనియర్ సివిల్ సర్జన్లు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం హనుమకొండ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ సాంబశివరావు మహబూబ్‌నగర్‌లో పోస్టింగ్ తీసుకొని ఇక్కడ వర్క్ ఆర్డర్‌తో పని చేస్తున్నారు. డాక్టర్ సాంబశివరావు ములుగు, ఆదిలాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, నల్లగొండ డీఎంహెచ్‌వో పోస్టు కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ములుగు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య హనుమకొండ పోస్టింగ్ కావడంతో హనుమకొండకు వచ్చే అవకాశం ఉంది. అయితే డాక్టర్ అప్పయ్య, డాక్టర్ సాంబశివరావులు కూడా బదిలీ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇక వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ నాలుగేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నారు. ఆయన పోస్టింగ్ మాత్రం కరీంనగర్ జిల్లా కావడంతో తిరిగి అక్కడికి వెళ్లే అవకాశం ఉంది. వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు ఇద్దరు సివిల్ సర్జన్ స్థాయి అధికారులు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుధీర్‌సింగ్ ఒకే జిల్లాలో పనిచేసి రికార్డు సృష్టించారు. ప్రస్తుతం వీరిద్దరు బదిలీ అయ్యే అవకాశం ఉంది. వరంగల్ డీఎంహెచ్‌వో పోస్టు కోసం మెదక్‌లో పని చేస్తున్న డాక్టర్ శ్రీరామ్ స్పౌజ్ కోటాలో ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఎంజీఎం సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ హరీష్‌రావు.. ప్రస్తుతం నాలుగేళ్లు పూర్తిచేసుకున్నందున బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఈ పోస్టు కోసం భూపాలపల్లి జిల్లా డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ చల్లా మధుసూదన్ మెడికల్ గ్రౌండ్ కోటాలో ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సూపరిండెంటెంట్ కోసం పోటాపోటీ

ఎంజీఎం సూపరిండెంటెంట్ కోసం పలువురు ప్రొఫెసర్లు పోటీ పడుతున్నట్లు సమాచారం. ప్రొఫెసర్ గోపాల్‌రావు, ప్రొఫెసర్ భిక్షపతిరావు, ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, ప్రొఫెసర్ రాంకుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ మధుబాబు ఈపోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఎఫ్ఏసీ హోదాలో పని చేస్తున్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంజీఎం ఆస్పత్రి నుంచి వివిధ విభాగాలకు చెందిన 45 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు బదిలీ కానున్నారు. అదే విధంగా మినిస్టీరియల్ సిబ్బంది కూడా పలువురు బదిలీ కానున్నారు. కాగా, దీర్ఘకాలికంగా కాకతీయ మెడికల్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న 85 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు బదిలీ కానున్నారు. ఈ మధ్య మెడికల్ కళాశాల రావడంతో బదిలీలకు ఎక్కువ ఆస్కారం ఏర్పడింది. సూర్యాపేట, మహబూబాబాద్, భూపాలపల్లి తదితర ప్రాంతాల్లోని వైద్య కళాశాలలకు వెళ్లిన ప్రొఫెసర్లు కేఎంసీ పోస్టు కోసం ఎదురు చూస్తున్నారు.

నేటి నుంచి శాకంబరీ ఉత్సవాలు



వరంగల్ జిల్లా కలెక్టర్‌కు శాకంబరీ ఉత్సవాల ఆహ్వానం అందజేస్తున్న ఈవో, అర్చకులు

వరంగల్ కల్చరల్, జూలై 5: భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న భద్రకాళి అమ్మవారి శాకంబరీ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. శనివారం నుంచి 21 వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మొదటి రోజు (శనివారం) ఉత్సవాలను పురస్కరించుకొని భద్రకాళి అమ్మవారికి సహస్ర కలశాభిషేకం, వేయి కలశాలతో అమ్మవారిని అభిషేకించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ఉదయం 4.30గంటలకు అమ్మవారికి నిత్యాహ్నికం, ఉత్సవ ఆజ్ఞ ప్రార్థన, 6.30 గంటల నుంచి గౌరీ గణపతి పూజ, ఆయుష్య మంత్ర జపం, హోమాలు, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు అమ్మవారికి సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ జరుగుతుంది. 21న (ఆదివారం) గురుపౌర్ణమి పురస్కరించుకుని కూరగాయలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కాగా ఏడాదిలో నాలుగుసార్లు నవరాత్రి ఉత్సవాలు జరిగే ఏకైక అమ్మవారి దేవాలయం ఇదే కావడం విశేషం. శాకంబరి ఉత్సవాలను తిలకించేందుకు దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివస్తుంటారు.

కలెక్టర్, సీపీకి ఆహ్వానం

శాకంబరి ఉత్సవాలకు కలెక్టర్ సత్య శారదాదేవి, పోలీసు కమిషనర్ అంబర్‌కిశోర్ ఝాను ఆలయ ఈవో శేషు భారతి, ప్రధానా ర్చకుడు భద్రకాళి శేషులు కలిసి ఆహ్వానం అందజేశారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి..: ఈవో

భద్రకాళి అమ్మవారి ఆలయంలో శనివారం నుంచి 16రోజుల పాటు జరిగే శాకంబరి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. నిత్యం అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాదాలు వితరణ జరుగుతుంది. తాగునీటి సౌకర్యం, పోలీసు భద్రత, అన్ని శాఖల సమన్వయంతో ఉత్సవాలను నిర్వహిస్తాం. ఉత్సవాల ప్రారంభోత్సవానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, అధికారులు హాజరవుతారు.

అశ్వారావుపేట సీఐ, సిబ్బందిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, జూలై 5 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురు పోలీస్ సిబ్బందిపై శుక్రవారం మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపారు. సీఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నార్కపేటకు చెందిన శ్రీరాముల శ్రీనివాస్ భద్రాదికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాడు. స్టేషన్ సీఐ జితేందర్‌రెడ్డితో పాటు మరో నలుగురు పోలీస్ సిబ్బంది ఎస్సై శ్రీనివాస్‌ను వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురై జూన్ 30న మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు అర్తిగార్డెన్ సమీపంలో పురుగుల మందు తాగాడు. తర్వాత తాను పురుగుల మందు తాగానని 108కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, టౌన్ ఎస్సై అరుణలు ఘటన స్థలానికి చేరుకుని 108 ద్వారా చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్‌కు మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ్నుంచి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. బాధితుడు శ్రీనివాస్ భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డితో పాటు కానిస్టేబుళ్లు సుభాని, శేఖర్, సన్యాసయ్య నాయుడు, శివనాగరాజులపై ఎస్సీ, ఎస్టీకేసు నమోదు చేసినట్లు మానుకోట టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు.

బ్యాంకు ఏజెంట్ వేధింపులతో వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌గౌడ్(ఫైల్)

ఐనవోలు, జులై 5: బ్యాంకు నుంచి రుణం తీసుకోగా ఏజెంట్ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. బండి శ్రీనివాస్‌గౌడ్ (37) హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. సొంత ఇంటిని నిర్మించుకోగా అందుకు ప్రైవేటు బ్యాంక్‌లో సుమారు రూ.8లక్షల రుణం తీసుకున్నాడు. ప్రతీ నెల వాయిదాలు చెల్లించేవాడు. కొన్ని వాయిదాలు నిలిచిపోయాయి. వ్యాపారం నడవకపోవడం చేసిన అప్పులు భారంగా మారా యి. భార్య కూలీ పనులకు వెళుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. ఈ క్రమంలో ఇంటి కోసం తీసుకున్న రుణం వాయిదాలు కొన్ని చెల్లించాల్సి ఉండగా ప్రైవేటు బ్యాంక్ ఏజెంట్ నిత్యం అప్పు చెల్లించాలని, లేకుంటే ఇంటిని వేలం వేస్తామని వేధించాడు. దానికి తోడు చేబదులు చేసిన అప్పులు సైతం భారంగా మారాయి. దీంతో మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జఫర్‌గఢ్ ఎస్సై శీలం రవియాదవ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ సెమిస్టర్ల ఫలితాల వెల్లడి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 5: కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాల డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల ఫలితాలను కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి విడుదల చేశారు. కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతితో కలిసి ఫలితాలను వెల్లడించారు. రెండో సెమిస్టర్‌లో 1,026 మంది పరీక్షకు హాజరుకాగా, 429 (41.81 శాతం) ఉత్తీర్ణులుకాగా, నాలుగో సెమిస్టర్‌లో 1,053 పరీక్షకు హాజరుకాగా 450 (51.28 శాతం) ఉత్తీర్ణత సాధించగా, ఆరో సెమిస్టర్‌లో 731 మంది విద్యార్థులు హాజరుకాగా, 526 మంది (71.96 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ కార్యక్రమంలో కేయూ అదనపు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, ఆర్ట్స్ కళాశాల పరీక్షల విభాగం అధికారులు డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ నహీద పర్వీన్, డాక్టర్ రాజు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ల ఫలితాలను వెల్లడిస్తున్న కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, తదితరులు

ఉమ్మడి జిల్లాలో కల్తీకల్లు మాటేలేదు..

ఫోరెన్సిక్ రిపోర్టు ప్రకారమే తదుపరి చర్యలు : వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు



శ్రావణ్ తల్లి జయప్రద నుంచి వివరాలు రికార్డు చేస్తున్న వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా), జూలై5 : ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మునుపెన్నడూ తాటి కల్లులో కల్తీ మాటేలేదని, రామన్నగూడెంలో కల్తీకల్లుతో ఇద్దరు యువకులు మృతి చెందారని పేపర్లల్లో వచ్చిన కథనాలు చూస్తే ఆశ్చర్యం కలిగిందని ఎక్సైజ్ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెంలో శుక్రవారం పర్యటించారు. స్నేహితుల జన్మదిన వేడుక విందులో పాల్గొని అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మృతి చెందిన బోగోజి శ్రావణ్, ఎస్‌కే రహీమ్‌పాషా కుటుంబాల నుంచి వాంగ్మూలాలను, మిగతా ఏడుగురు స్నేహితుల నుంచి వాంగ్మూలాలను రికార్డు చేసుకున్నారు. ఈ క్రమంలో రహీమ్ తల్లిదండ్రులతో పాటు అతని చిన్నాన్న విందులో పాల్గొన్న ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘాపెట్టి లోతైన విచారణ చేయిస్తేనే తప్ప మిస్టరీ వీడదని అసిస్టెంటు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తాటికల్లు తాగిన ప్రదేశాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌రావు మాట్లాడుతూ రామన్నగూడెంలో ఇద్దరు యువకుల మృతి మిస్టరీగా ఉన్నట్టు బాధిత కుటుంబాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. మెరుగైన వైద్యం అందినప్పటికీ యువకులు మృత్యువాత పడడంతో ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగానే క్షేత్రస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రామన్నగూడెంలో తాటికల్లు తీసే ప్రతీ గీతకార్మికుని నుంచి నమూనాలు సేకరించాలని ఎక్సైజ్ సీఐ తిరుపతిని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్, సీఐ సంజీవ, ఎక్సైజ్ ఇన్‌చార్జ్ సీఐ తిరుపతి, ఎస్ఐ సతీష్, ఎక్సైజ్ ఎస్ఐ రజిత, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

పోస్టుమార్టం నివేదికలో వివరాలు తెలుస్తాయి..

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్ రావు

తొర్రూరు, జూలై 5 : నర్సింహుల పేట మండలం రామన్నగూడెం గ్రామంలో స్నేహితుల పుట్టిన రోజు సందర్భంగా రెండు కుటుంబాల్లో పెను విషాదం నింపిన సంఘటనలో మృతి చెందిన శ్రావణ్, రహీమ్ పాషా మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదికలో తెలుస్తాయని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నగూడెంకు చెందిన స్నేహితులు గలనెల 10వ తేదీన పుట్టినరోజు సందర్భంగా పార్టీ చేసుకున్న నేపథ్యంలో కల్తీకల్లుతాగి మృతి చెందారన్నది నిర్ధారణ కాలేదన్నారు. కల్లుతో పాటు మద్యం, చికెన్‌తో పాటు ఇతర స్టఫ్ తిన్నారని, అస్వస్థతకు గురైన వారు ఆస్పత్రికి వెళ్తే వారికి జాండిస్ అని నిర్ధారణ అయిందన్నారు. పుట్టిన రోజుకు తీసుకువచ్చిన తాటికల్లు తాగి మృతి చెందారని కొన్ని వార్తాపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రావడంతో తాము శుక్రవారం గ్రామంతో పాటు వారి మిత్రులను, గ్రామస్థులను విచారించామన్నారు. గ్రామంలో కల్లు శాంపిల్స్ సేకరించామని, పోలీసులు కూడా నమూనాలను ల్యాబ్‌కు పంపారన్నారు. వివరాలు పోస్టుమార్టం నివేదికలో తెలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు, ఇన్‌చార్జ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై తిరుపతి, ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.



తొర్రూరు సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌రావు

జీకే నామ్ చారిటబుల్ ట్రస్టు పోస్టర్‌ను ఆవిష్కరణ

వరంగల్ లీగల్, జూలై 5: ఢిల్లీకి చెందిన జీకే నామ్ ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్టు వారు పబ్లిక్ రిడ్రెసల్ అసోసియేటెడ్ నెట్ వర్క్ (ప్రాన్) ప్రాజెక్టుకు సంబంధించిన పోస్టర్‌ను వరంగల్ జిల్లా జడ్జి కె.నిర్మల గీతాంబ ఆవిష్కరించారు. శుక్రవారం జిల్లా న్యాయసేవా సంస్థ సదన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి న్యాయమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రాజెక్టులో భాగంగా శారీరక వికలాంగులు, అనాథలకు ఉచితంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి ముందుకొచ్చిన ప్రాన్ సంస్థను అభినందించారు. నూతన టెక్నాలజీపై ఉచితంగా వైద్యశిబిరాలు న్యాయ సేవా సంస్థ సహకారంతో ఉచితంగా న్యాయ సేవలు అందిస్తామని న్యాయమూర్తి తెలిపారు. అధునాత టెక్నాలజీలో ఉచిత శిక్షణ కోసం అవసరమున్న మహిళలు ఈ నెల 15 నుంచి జిల్లా న్యాయ సేవా సంస్థ సూపరింటెండెంట్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.జీవన్‌గౌడ్, ప్రధానకార్యదర్శి ముదసరి అహ్మద్, కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



డాక్టర్ నిమ్మ సుదర్శన్



డాక్టర్ నవీన్



డాక్టర్ కె.అనితారెడ్డి



ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్



డాక్టర్ బొద్దిరెడ్డి రమ



పుల్లూరి సుధాకర్



డాక్టర్ చిర్ర రాజు



డాక్టర్ భీమర్తి సుకుమారి



మూడ్ బాల్ చౌహాన్

సామాజిక సమీకరణ మేళవింపు

● ఎట్టకేలకు కేయూ ఈసీ నియామకం ● కేయూ పాలక మండలిలో అన్నివర్గాలకు ప్రాధాన్యత ● మూడేళ్ల పాటు పదవీ కాలం

కేయూ క్యాంపస్, జూలై 5: రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద యూనివర్సిటీ అయిన కాకతీయ యూనివర్సిటీకి ఎట్టకేలకు అత్యున్నత పాలక మండలి నియామకమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పాలకమండలిని నియమించారు. పాలకమండలిలో సామాజిక సమీకరణతో మంచి కూర్పు చేశారు. గత అక్టోబరులో కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి గడువు ముగియగా, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పాలక మండలిని నియమించింది. అయితే పాలక మండలిలోని సభ్యుల్లో ఒకరు కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఎంపిక కమిటీ (సెర్చ్ కమిటీ)లో సభ్యుడిగా ఉంటారు. వీసీని నియమించే సెర్చ్ కమిటీలో పాలక మండలి సభ్యుడు లేకపోతే వీసీ నియామకం అలస్యం జరిగే పరిస్థితి నెలకొనడంతో రాష్ట్ర ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీకి పాలక మండలిని నియమించింది.

యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ కోటాలో ప్రొఫెసర్ బానోత్ సురేశ్‌లాల్, (ఎస్టీ, లంబాడ), యూనివర్సిటీ అనుబంధ కళాశాల ప్రిన్సిపాల్ కోటాలో సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిమ్మ సుదర్శన్ (ఎస్సీ, మాదిగ), యూనివర్సిటీ కళాశాల టీచర్స్ కోటాలో డాక్టర్ బొద్దిరెడ్డి రమ, (ఓసీ, రెడ్డి), అఫిలియేటెడ్ కళాశాల ప్రిన్సిపాల్ కోటాల్లో ఫోర్టు వరంగల్ రోడ్డులోని ఏఎస్ఎం డిగ్రీ, పీజీ కళాశాల ఉమెన్స్ (ఎయిడెడ్) ప్రిన్సిపాల్ డాక్టర్ భీమర్తి సుకుమారి (బీసీ, గంగపుత్ర), యూనివర్సిటీ అఫిలియేటెడ్ కళాశాల టీచర్స్ కోటా నుంచి నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్, (బీసీ, మున్నూరుకాపు), వివిధ రంగాల నుంచి ఎంపిక చేసిన వారిలో కె.అనితారెడ్డి, (ఓసీ, రెడ్డి), డాక్టర్ చిర్ర రాజు, (బీసీ, గౌడ), మూడ్ బాలు చౌహాన్ (లంబాడ), పుల్లూరి సుధాకర్ (బీసీ, మున్నురుకాపు)లను రాష్ట్ర ప్రభుత్వం నామినేడ్ చేసింది. మూడేళ్ల కాలానికి గాను నూతన పాలక మండలి విధులు నిర్వహించనుంది.

సామాజిక సమీకరణకు పెద్దపీట

కాకతీయ యూనివర్సిటీ కీలకమైన నిర్ణయాల్లో పాలక మండలి పాత్ర కీలకం. వర్సిటీ అటానమస్ కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పాలక మండలిలో తీసుకున్న నిర్ణయం మేరకే వర్సిటీలో అభివృద్ధి కార్యక్రమాలు, బోధన, బోధనేతర అంశాలతో పాటు ఇతర అన్ని అంశాలపై చర్చిస్తుంది. పాలక మండలిలో తీసుకున్న నిర్ణయమే ఫైనల్‌గా నిలుస్తోంది.

పలు సవాళ్లు

కాకతీయ యూనివర్సిటీ కొత్త పాలక మండలి ఎదుట కీలక సవాళ్లున్నాయి. ప్రధానంగా కాకతీయ యూనివర్సిటీ భూములన్నీ అన్యాక్రాంతం అయ్యాయి. వీసీ, పాలక మండలి సభ్యులుగా వచ్చిన వారంతా వర్సిటీ భూమి సమస్యలను పరిష్కరించకుండానే పదవి నుంచి దిగిపోతున్నారు. అయితే వర్సిటీలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు కీలక స్థానంలో ఉండి అప్పటి అధికారులను మేనేజ్ చేసి వర్సిటీ భూముల అక్రమణలను అడ్డుకోలేదని, వర్సిటీ భూ కమిటీకి అడ్డుతగిలారనే విమర్శలున్నాయి. తాజాగా వచ్చిన పాలక మండలి సభ్యులు ప్రధానంగా వర్సిటీ భూములతో పాటు వర్సిటీలో బోధన, బోధనేతర రంగాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 400 మంది బోధన సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 85కి పడిపోయింది. కాంట్రాక్టు, పార్టుటైమ్ ఉద్యోగులతో బోధన మమ అనిపిస్తున్నారు. వర్సిటీ బోధన ప్రామాణికంగా లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీతో పాటు ఆర్ట్స్ కళాశాలలోనూ పాఠాలు చెప్పక అధ్యాపకులు పదవులను అనుభవిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. అలాగే వర్సిటీలో బోధన, బోధనేతర సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. ఎవ్వరికివారే యమునా తీరే అన్న చందంగా మారింది. రాష్ట్రంలోని పోటీ వర్సిటీలకు అనుగుణంగా నూతన కోర్సుల రూపకల్పన లేదు. వర్సిటీలో డిమాండ్ ఉన్న కోర్సుల ఊసే లేదు. సంప్రదాయ కోర్సులతో పాటు మార్కెట్‌కు అనుగుణంగా నూతన కోర్సులు ప్రారంభించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన వర్సిటీ ఉన్నతాధికారులు అసలు విషయాన్ని మరిచారు.

తగ్గుతున్న కళాశాలలు.. విద్యార్థులు..

వర్సిటీ పరిధిలో చాలా కళాశాలలు అటానమస్ సాధించాయి. అలాగే సంప్రదాయ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీతో పాటు కొన్ని కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం లేదు. అడ్మిషన్లు తగ్గిపోవడంతో పాటు అటానమస్ సాధించిన కళాశాలలు వర్సిటీ నుంచి విడిపోతాయి. దీంతో వర్సిటీకి రావాల్సిన అఫ్లియేషన్ ఫీజు, పరీక్షల ఫీజులు ఇలా చాలా రకాల ఫీజులు వర్సిటీ నష్టపోతోంది. దీంతో వర్సిటీలో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. దీనిపై పాలక మండలి దృష్టి సారించాల్సిన అవసరం ఉంది..

ఖమ్మం, ఆదిలాదాద్‌కు మొండిచెయ్యి

కేయూ పాలకమండలిలో జిల్లాల మధ్య సమతుల్యత దెబ్బతింది. వరంగల్ తర్వాత అత్యధిక కళాశాలలున్నా ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలకు ఈసీలో మొండిచెయ్యి చూపారు. గతంలో ప్రతీ పాలకమండలిలో ప్రాధాన్యత దక్కింది. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాకు ఈసీలో ప్రాధాన్యత దక్కకపోవడంతో ఆయా జిల్లాల ప్రతినిధులపై ఒత్తిడి పెరుగుతోంది. ఆయా జిల్లాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ జిల్లాలకు ఈసీలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈసీ సభ్యులకు అభినందనల వెల్లువ



సురేష్‌లాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కేయూ క్యాంపస్, జూలై 5: కాకతీయ యూనివర్సిటీ నూతన పాలక మండలి సభ్యులకు శుక్రవారం పలు విద్యార్థి సంఘాల నేతలు, ఉద్యోగులు, బంధువులు పుష్పగుచ్ఛాలు, శాలువలు అందచేసి ఘనంగా అభినందించారు. శుక్ర వారం సాయంత్రం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నూతన పాలక మండలి సభ్యులను వర్సిటీ క్యాంపస్ లోని కమిటీ హాల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర విద్యాశాధికారులు వెలువరించిన ఉత్తర్వుల మేరకు పాలక మండలి సభ్యుల నుంచి ఆంగీకార పత్రాలను స్వీకరించారు. వీరిలో ప్రొఫెసర్ బానోత్ సురేశ్‌లాల్, డాక్టర్ బి.సుకు మారి, డాక్టర్ బొద్దిరెడ్డి రమ, డాక్టర్ మల్లం నవీన్, కె.అని తారెడ్డి, డాక్టర్ చిర్ర రాజు, పుల్లూరి సుధాకర్‌లున్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఫ్ట తోట రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సురేశ్‌లాల్‌కు అభినందనలు

వర్సిటీ క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో ప్రిన్సిపాల్ బానోత్ సురేశ్‌లాల్ నూతనంగా పాలకమండలి సభ్యులుగా ఎంపికైనందుకుగాను అధ్యాపకులు, విద్యార్థులు శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ చందూలాల్ తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణను సత్కరిస్తున్న విశ్వఖర్మ నాయకులు

విశ్వఖర్మ ఖ్యాతిని పెంచాలి

సంగెం, జూలై 5 : విశ్వఖర్మ ఖ్యాతిని పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని విశ్వఖర్మ జిల్లా అధ్యక్షుడు బండ్లోజు నర్సింహచారి, మండల శాఖ అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారిలు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో తాజా మాజీ ఎంపీటీసీ సుతారి బాలకృష్ణకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవేంద్రాచారి, ప్రధానకార్యదర్శి రాచమల్ల కోదండ రాములు, కోశాధికారి సదాశివుడు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు చేయూత



చిన్నారులకు బియ్యం, దుస్తులు అందజేస్తున్న సీఐ శివకుమార్

పోచమ్మమైదాన్, జూలై 5 : దేశాయిపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు నిరుపేద చిన్నారులకు జాతీయ మానవ హక్కుల సంఘం-న్యాయ సేవ ప్రతినిధులు చేయూత నందించారు. దేశాయిపేటలోని బాబు జగ్జీవన్‌రాం జంక్షన్‌లో శుక్రవారం ఇంతేజార్ గంజ్ సీఐ శివకుమార్ చేతుల మీదుగా చిన్నారులకు 50కిలోల బియ్యం, దుస్తులు అందజేశారు. ఎన్‌హెచ్ఆర్-జేఎం రాష్ట్రవర్కింగ్ ప్రెసిడెంట్ యాకుబ్‌అలీ, ప్రధాన కార్యదర్శి పోలెపాక మధు, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోలె పాక రాణి, సౌరం అభిలాష్, కొగిల సుధాకర్, మేకల కమలాకర్, చిన్నయ్య, శోభ, పద్మ, కవిత, రాణి పాల్గొన్నారు.

స్కూల్ సిబ్బందికి చీరల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న యోగానంద్

శంభునిపేట, జూలై 5 : కష్టాల్లో ఉన్న వారిని గుర్తించి సహకారం అందించాలని రిషినంద్ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ కొల్లూరి యోగానంద్ అన్నారు. రంగశాయిపేటకు చెందిన కె.యోగానంద్ కుమారుడు దివంగత రిషినంద్ జయంతి సందర్భంగా శుక్రవారం బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ సిబ్బందికి, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యోగానంద్ మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు ఎప్పుడు తన కుమారుడి పేరున సహకారం అందించటానికి ముందు ఉంటానని తెలిపారు. స్కూల్ డైరెక్టర్ వేంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పేదలకు సేవ చేస్తున్న ట్రస్టుని అభినందించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మండల పరశురాములు, రిసినంద్ కుటుంబ సభ్యులు స్వరూప, రచనశ్రీ, తుషిక్‌నందన్, పూర్వీచిన్మయిజోశ్వికానంద, శివకుమార్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం



మిల్స్‌కాలనీ పోలీసుల అదుపులో ఉన్న బీజేపీ నాయకులు

కరీమాబాద్, జూలై 5: బీజేపీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదాసు రాజు అన్నారు. శుక్రవారం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు టీజీపీఎస్సీ, నిరుద్యోగుల సమస్యలపై జిల్లాల వారీగా కలెక్టరేట్ ముట్టడికి యత్నిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు పుప్పాలశ్రీనివాస్, చింతల అనిల్, మండల భూపాల్, గొర్రె కోటి, జిలకర వీరస్వామి, తాళ్లపెల్లి రమేష్ గౌడ్, వేల్పుల నందు, ఇనుముల రాజు ఉన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు మాట్లాడుతూ తూర్పు బీజేపీ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిని పిరికపంద చర్యగా భావిస్తున్నామని, నిరుద్యోగులు విద్యార్థులు ఉద్యోగాల కోసం పోరాడుతున్న బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదన్నారు.

ప్రమాదకరంగా జంక్షన్

» నత్తనడకన అభివృద్ధి పనులు



రంగశాయిపేట జంక్షన్‌లో హైవే రోడ్డుపై ఏర్పడిన గుంత



రంగశాయిపేట జాతీయ రహదారిపై గుంతలో నిలిచిన వాన నీరు

శంభునిపేట, జూలై 5: వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్ జంక్షన్‌లో జాతీయ రహదారి ఏళ్లుగా గుంతలు పడినా పట్టించుకునే నాథుడే లేడు. జంక్షన్ అభివృద్ధితో పాటు డ్రైనేజీ కోసం జంక్షన్‌లో రెండేళ్ల క్రితం అభివృద్ధి పనులు చేపట్టారు. పనులనేపథ్యంలో ఈమార్గాన్ని మూసివేశారు. నాటినుంచి పనులు సాగుతూనే ఉన్నాయి. నగరానికి ఇదే ప్రధాన రహదారి కావటంతో ప్రయాణికులుతీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలాఉండగా,దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుంచి రంగశాయిపేట, శంభునిపేట ప్రధాన రిజర్వాయర్(వాటర్ ట్యాంకు)లకు నీటిని పంపించే ప్రధాన పైపులైన్ జాతీయ రహదారి పక్కనే ఉంది. కేబుల్, మిషన్ భగీరథ పైపులైన్ కొరకు రోడ్డు పక్కనే గుంతలు తవ్వారు. పనులు పూర్తయ్యాక గుంతల్ని సరిగా పూడ్చకపోవడంతో గుంతల్లో పడి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటికితోడు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు జంకుతున్నారు. గుంతల రోడ్డుతో చినుకు పడితే చాలు రోడ్లపై నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మునిసిపల్, ఆర్అండ్‌బీ శాఖల మధ్య సమన్వయ లోపంతో సమస్య పరిష్కారానికి నోచుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎన్‌హెచ్ఏఐ నగరంలోనే పరిస్థితి ఇలా ఉందని వాపోతున్నారు. రంగశాయిపేట గవిచర్ల క్రాస్‌రోడ్ జంక్షన్‌లో ద్విచక్ర వాహనంపై నుంచి పడి విద్యార్థులు గాయపడ్డారు. అలాగే గవిచర్ల వైపు నుంచి వచ్చే ఓ ట్రాక్టర్, ఖమ్మం వైపు వచ్చే లారీలు గుంత పక్కకు తిప్పుతుండగా ఓ కారుకు ఢీకొట్టగా కారు ధ్వంసమైంది.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

చిట్టిమళ్ల విశ్వకుమార్, రంగశాయిపేట



వాహనదారులకు సరైన పత్రాలు లేవని చలాన్లు వేస్తుంటారు. కానీ, సరైన రోడ్లు వేయటంలో విఫలమవుతున్నారు. నగరంలోని జాతీయ రహదారులపై గుంతలు ఉండటం అధికారుల పనికి నిదర్శనం. ఎలాంటి పెద్ద ప్రమాదాలు జరగకముందే వెంటనే శాశ్వతంగా గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్

మట్టెవాడ, జూలై 5 : రామన్నపేటకు చెందిన రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఏ.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'కాలనీలోని సమస్యలు పరిష్కరించండి'



ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్‌సిటీ, జూలై 5: నగరంలోని 14వ డివిజన్ మణికంఠ కాలనీలోని సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆ కాలనీ అభివృద్ధి కమిటీ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్యను వారి క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. కార్యాలయాలు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ మేరకు వారికి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోతు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు హనుమాండ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఓదెల తిరుపతి, కోశాధికారి కంచె మహేందర్, నాయకులు వెలిశాల రమేష్ బాబు, సూరినేని దేవేందర్‌రావు, నల్ల వెంకటేశ్వర్లు, రమేష్, కంచె రవి, భరత్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంను తనిఖీ చేసిన కలెక్టర్

» రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

» వైద్యాధికారులతో సమీక్షా సమావేశం



ఎంజీఎంలో పర్యటిస్తున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి

వరంగల్ మెడికల్, జూలై 5: వరంగల్ నగరంలోని మహాత్మాగాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఆస్పత్రిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖలు హైదరాబాద్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆదేశించిన మేరకు ఆస్పత్రిలోని స్కూల్ ఆఫ్ నర్సింగ్ భవనాన్ని, ఆస్పత్రి సూపరింటెండెంట్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి భవన స్థితిగతులను పరిశీలించామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సింగ్ విద్యార్థులతో నెలకొన్న సమస్యలు, అందిస్తున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్న దృష్ట్యా వెంటనే ఇతర భవనంలోకి మార్చాల్సిన అవసరం ఉందని తెలిపారు. హౌసింగ్, టీజీఎంఐడీసీ, ఆర్అండ్‌బీ, టౌన్ ప్లానింగ్, ఇరిగేషన్ అధికారులు భవనాన్ని పరిశీలించి భవన స్థితిగతులు, చేయాల్సిన మరమ్మతులపై తక్షణమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంజీఎం ఆస్పత్రి పరిధిలోగల జూనియర్ డాక్టర్లు, స్కూల్ ఆఫ్ నర్సింగ్ మొత్తం 500 మంది విద్యార్థులకు ప్రత్యామ్నాయ వసతి కోసం అవసరమైన భవనం గురించి ఈ సందర్భంగా అధికారులతో చర్చించారు. వరంగల్ నగరంలోని రాంకీలో గృహ నిర్మాణ శాఖకు సంబంధించి కొత్తగా నిర్మించిన భవనాలను, ఇతర రెండు ప్రాంతాల్లోని భవనాలను ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు ఆస్పత్రిలోని ఔట్ పేషెంట్ వార్డు, ఎమర్జెన్సీ వార్డులను స్వయంగా పరిశీలించారు. ఎమర్జెన్సీ వార్డులో ఏసీ పనిచేయకపోవడం, అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా విభాగాల వద్ద రోగులు కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఆర్ఎంవో శ్రీనివాస్, ఆర్అండ్‌బీ అధికారి జితేందర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, గృహనిర్మాణ శాఖ అధికారి వాసు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆలయాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి



ఆలయంలో మొక్కలు నాటుతున్న కాలనీవాసులు

శంభునిపేట, జూలై 5: పచ్చదనం, పరిశుభ్రతతో ఆలయాలను ఆహ్లాదకంగా తీర్చిదిద్దాలని రంగశాయిపేట కాలనీస్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు కర్నె రవీందర్ కోరారు. రంగశాయిపేట సత్యసాయినగర్ కాలనీలోని పోచమ్మ ఆలయంలో కాలనీవాసులు అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడంలోబోనాల నిర్వహణపై చర్చించారు. అనంతరం పూలమొక్కలను నాటారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, శ్రీనివాస గుప్త, అనుమాసు రాంబాబు, తరుగల శ్రీధర్, విజేందర్‌రెడ్డి, రాజు, రాజేశ్వర్, ఉదయ్ కుమార్, రుత్విక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 5: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం మామునూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా మామునూర్, కుమ్మరిపల్లి, డెయిరీఫామ్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని వరంగల్ డీఈ శంకేసి మల్లిఖార్జున్ తెలిపారు.

కరెంట్ తీగల వద్ద జాగ్రత్తగా ఉండాలి



రైతులకు అవగహన కల్పిస్తున్న సీజీఎం కిషన్

హనుమకొండ టౌన్, జూలై 5: కరెంట్ తీగల వద్ద ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఎన్పీడీసీఎల్ సీజీఎం (ఆపరేషన్) కె.కిషన్ సూచించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా వరంగల్ సర్కిల్‌లోని వర్ధన్నపేట సబ్‌డివిజన్‌లో చంద్రుతండా, జుగ్నుతండా, రాంధన్ తండాలో గురువారం అవగహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీజీఎం కిషన్ మాట్లాడుతూ.. బట్టలు ఆరేసేందుకు ప్లాస్టిక్ దండెములను వినియోగించాలన్నారు. విద్యుత్ సరఫరా అయ్యే వైర్లను ఎట్టిపరిస్థితుల్లో దండెంలకు, రేకులకు తాకకుండా జాగ్రత్తపడాలన్నారు. గృహాలల్లో, పంట పొలాల వద్ద నాణ్యమైన వైర్లు వాడక విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. పశువులను ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వైపు వెళ్లకుండా జాగ్రత్తపడాలన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలకు స్థానిక ఏఈని కానీ లేదా 18004250028 టోల్‌ఫ్రీ నెంబర్, లేదా 1912కు ఫోన్ చేసైనా సమస్యను తెలుపవచ్చన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

» పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



మండిబజార్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మట్టెవాడ, జూలై 5: రాత్రివేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. శుక్రవారం రాత్రి వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పోలీసులతో కలిసి సీపీ వరంగల్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించారు. మండిబజార్‌లో సీపీ స్వయంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సమయంలోగా వ్యాపార సంస్థలు మూసివేయాల్సిందిగా సూచించారు. అలాగే రాత్రి సమయంలో పోకిరీలతోపాటు నేరస్థులను నియంత్రించేందుకు ఇకపై నగరంలో ముమ్మరంగా పోలీసు పెట్రోలింగ్, వాహన తనిఖీలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాత్రి సమయాల్లో ఆకతాయిలు బయటికి వచ్చి అల్లరి చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు.

కార్యక్రమంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రొక్లైనర్ ఢీకొని కోట ద్వారం ధ్వంసం



ఖిలావరంగల్ మధ్యకోటలోని ప్రధాన ద్వారం



ప్రొక్లైనర్ ఢీకొనడంతో విరిగిన ప్రధాన ద్వారం

ఖిలావరంగల్, జూలై 5 : మధ్యకోటలో కాకతీయుల కాలం నాటి ప్రధాన ద్వారాన్ని ప్రొక్లైనర్ ఢీకొనడంతో పడమర వైపు గల కమాన్ శుక్రవారం ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి ఖిలావరంగల్‌కు ప్రొక్లైనర్ వస్తుండగా, కింది భాగం తగలడంతో కమాన్ మీటరు వరకు పగిలిపోయింది. చుట్టూ ఉన్న రాళ్లు పగుళ్లు వచ్చాయి. ఈ విషయమై కేంద్ర పురావస్తుశాఖ సిబ్బంది విరిగిన కోట కమాన్‌ను, ఫొటోలతో జిల్లా అధికారి మల్లేశంకు సమాచారమిచ్చారు. వారి ఆదేశంతో ప్రొక్లైనర్‌ను పట్టుకొని డ్రైవర్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

బొగ్గు గనుల వేలాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ కలెక్టరేట్, జూలై 5: బొగ్గు గనుల వేలం పాటను తక్షణమే రద్దు చేసి నేరుగా సింగరేణికి అప్పగించాలని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా గత నెలలో కేంద్ర ప్రభుత్వం వేలం ప్రకటించిందని, సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి ఉపరితల బొగ్గు గనిని కూడా వేలం పాట వేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల నాయకులు కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేలం నిర్వహించడం ద్వారా తెలంగాణప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. 135 సంవత్సరాల చరిత్ర కలిగిన గోదావరి పరీవాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలు ఉండి సింగరేణి యాజమాన్యంతో నడుస్తుండగా 2015లో కేంద్రం తీసుకొచ్చిన మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ ద్వారా తన ఆధీనంలోకి తీసుకుందన్నారు. గతంలోనే కోయగూడెం, సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనులు ప్రయివేట్ పరం అయ్యాయని, ఇప్పుడు మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లిలోని ఓపెన్ కాస్ట్ గనిని కేంద్రం ప్రైవేట్ పరం చేసే కుట్ర పన్నుతోందని తెలిపారు. శ్రావణపల్లి ఓపెన్‌కాస్ట్‌ను, కోయగూడెం, సత్తుపల్లి గనులను కూడా సింగరేణికి కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు బాబు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేశ్, సహాయ కార్యదర్శి దామెర కృష్ణ, ఉపాధ్యక్షుడు ఎండి.యాకూబ్ పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై అవగాహన పెంచుకోవాలి



ములుగు జిల్లా రైతులకు పెరటి కోళ్లు, సామగ్రిని అందిస్తున్న అమరేశ్వరి

శంభునిపేట, జూలై 5 : పెరటి కోళ్ల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని పశు పరిశోధనా స్థానం అధిపతి డాక్టర్ పి.అమరేశ్వరి అన్నారు. మామునూరులోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం పశు పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో ట్రైబల్ సబ్ ప్లాన్ పథకం కింద ములుగు జిల్లా రైతులకు పెరటి కోళ్ల పెంపకంపై శుక్రవారం అవగాహన సదస్సును నిర్వహించారు. 15 మంది రైతులను గుర్తించి వారికి కోళ్ళ పెంపకంపై శిక్షణను అందించారు. అనంతరం ఒక్కో రైతుకు 20 పెరటి కోళ్లతోపాటు ఫీడర్స్, వాటరర్స్, రాత్రి సమయంలో గూడుకు షెల్టర్ కూప్స్‌ను అందించారు. కార్యక్రమంలో సీనియర్ పరిశోధకులు డాక్టర్ ఎం.హనుమంతారావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.నరసింహ పాల్గొన్నారు.

గ్రామాల్లో వనమహోత్సవాలు

గీసుగొండ, జూలై 5: వజ్రోత్సవ వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీల్లో 13,500 మొక్కలను నాటినట్లు ఏపీఎం చంద్రకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్‌కుమార్, జీపీ ప్రత్యేక అధికారులు డాక్టర్ రమేష్, ప్రభాకర్, కార్యదర్శులు, అటవీశాఖ అధికారులు అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



అంబులెన్స్‌లో లచ్చమ్మను ఎంజీఎంకు తరలిస్తున్న స్థానికులు

ఖిలావరంగల్, జూలై 5 : ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం క్రిస్టియన్‌కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. క్రిస్టియన్‌కాలనీకి చెందిన గబ్బెట లచ్చమ్మ (61) కూలినాలీ చేసుకుని జీవిస్తోంది. ఈమెకు ఓ కూతురు ఉంది. శుక్రవారం మటన్ తీసుకొని ఇంటికి వెళ్తుండగా అదే సమయంలో విద్యార్థులను తీసుకొని వరంగల్‌కు వెళ్తున్న స్కూల్ బస్సు జంక్షన్‌లో లచ్చమ్మకు బస్సు తగలడంతో కిందపడిపోయింది.విద్యార్థులు కేకలు వేయడంతో డ్రైవర్ బస్సును ఆపి వృద్ధురాలిని పక్కకు జరిపి వెంటనే అక్కడి నుంచి వేగంగా వరంగల్‌లోని పాఠశాలకు బస్సును తరలించాడు. స్థానికుల సమాచారం మేరకు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, సిబ్బంది లచ్చమ్మను 108లో ఎంజీఎంకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

పోలీసులు స్కూల్ యాజ మాన్యానికి ఫోన్ చేయడంతో డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సరెండర్ చేశారు. మృతురాలి కుమార్తె రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రుణమాఫీకి ఆధార్ నమోదు చేసుకోవాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

నెక్కొండ, జూలై 5 : డీసీసీబీలో రుణ మాఫీ పొందుటకు గాను అర్హులైన రైతులు ఆధార్ కార్డులను ఆన్‌లైన్ చేసుకోవాలని బ్యాంక్ ఏజీఎం పి. కృష్ణమోహన్ కోరారు. శుక్రవారం నెక్కొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు రుణాలను సకాలంలో చెల్లించితే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ రకాల పథకాలకు అర్హత పొందుతారన్నారు. నూతనంగా తెలంగాణ దశాబ్ది డిపాజిట్ పథకం ద్వార అత్యధిక వడ్డీని పొందుటకు గాను ఖాతాదారులు బ్యాంక్‌లో డిపాజిట్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ డీసీసీబీ మెనేజర్‌లు ఎం. రజిత, ఈ.తిరుపతి, పీఏసీఎస్ సీవో మెడం సురేష్, సిబ్బంది నితిన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యతో అమీనాబాద్‌లో విషాదం


రంజిత్ (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 5: మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన ఓ యువకుడు కడప జిల్లాలో ఓ లాడ్జిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవటంతో శుక్రవారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన చీర కళావతి-మల్లేష్‌ల కుమారుడు చీర రంజిత్ (25) హైదరాబాద్‌లో కాళోజీ యూనివర్సిటీలో అగ్రికల్చర్ ఎంఎస్సీ ఫైనల్ సంవత్సరం చదువుతున్నాడు. కడప జిల్లాలో ఉన్న తన మిత్రుడు ప్రశాంత్‌రెడ్డి వివాహ వేడుకలకు వెళ్లాడు. అక్కడకి వెళ్లిన రంజిత్ ఓ లాడ్జీలో ఉన్నాడు. రంజిత్ ఇటీవల ఏఈవో పరీక్ష రాయటంతో పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని, ఉద్యోగం రాదోనని మనోవేదనతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రంజిత్ ఆత్మహత్యతో తల్లి దండ్రులు, కుటుంబ సభ్యులు బోరునా విలపించారు.

ఆగి ఉన్న స్కూటీని ఢీకొట్టిన ట్రాక్టర్

- ఇద్దరికి గాయాలు

నర్సంపేట టౌన్, జూలై 5 : ఆగి ఉన్న స్కూటీని ఓ ట్రాక్టర్ ఢీకొట్టడంతో స్కూటీ ధ్వంసం కాగా, ఇద్దరికి గాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... పట్టణంలోని బస్టాండ్ సెంటర్ సమీపంలోని దుకాణ సముదాయాల ముందు పార్క్ చేసిన స్కూటీని అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో స్కూటీ ధ్వంసమైంది. అక్కడ నిలబడి ఉన్న దుగ్గొండి మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన హన్మకొండ రాంనాథం కాలు విరిగి, తలకు గాయాలు కాగా, కొత్తగూడ మండలం పొనుగోడుకుచెందిన బుచ్చమ్మకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే వీరిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాంనాథంను మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. ఇదిలావుండగా ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పరారయ్యాడు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


హేమన్(ఫైల్)

రాయపర్తి, జూలై 5 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పానిష్ తండాలో శుక్రవారం చోటుచేసుకుంది. రాయపర్తి ఎస్ఐ సందీప్ కుమార్ కథనం ప్రకారం... పానిష్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త తండాకు చెందిన బానోతు హేమన్ (26), మండలంలోని జయరాం తండా పంచాయతీ పరిధిలోని సూర్యతండాకు చెందిన స్వరూపతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తల నడుమ మనస్పర్థలు రావడంతో భార్య గొడవ పెట్టుకుని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన హేమన్ ఈ నెల 3న రాయపర్తిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తల్లి కౌసల్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

- చికిత్స పొందుతూ...

ఖానాపురం : పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని నాజీతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై రఘు పతి తెలిపిన వివరాల ప్రకారం ఇదే తండాకు చెందిన జర్పుల కిషన్(44) గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. గురువారం కడుపునొప్పి తీవ్రంగా రావడంతో నొప్పి భరించలేక ఇంటివద్దనే పురుగుల మందు సేవించి కుటుంబ సభ్యులకు తెలపడంతో చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య భద్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీల వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం కాలయాపన

నెక్కొండ, జూలై 5 : కేంద్ర ప్రభుత్వం ఎస్సీల వర్గీకరణ సమస్యను పరిష్కరించకుండా ఎస్సీలకు తీరని అన్యాయం చేస్తుందని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ మెంబరు ఈదునూరి యాకయ్య ఆరోపించారు. ఈ నెల 7న వర్గీకరణ సాధనకు గాను ఏర్పాటు చేసిన చలో హైదరాబాద్ వాల్ పోస్టర్‌లను నెక్కొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం ఆయన విడుదలచేసి మాట్లాడారు. గత 30 సంవత్సరాలుగా మాదిగలు పార్లమెంట్‌లో వర్గీకరణ చట్టబద్ధత కోసం పోరాటాలు చేస్తుండగా పలువురు మాదిగలు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమాలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు మాదిగలు సిద్ధమవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం రమేశ్, జంజాల యాకుబ్, జనార్ధన్, అశోక్, రాజు, సతీష్ , నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణతోనే అధిక దిగుబడులు


అధికారుల సూచన మేరకే మందులు వాడాలి..

వర్ధన్నపేట, జూలై 5 : విత్తనాలు విత్తుకోవడం పూర్తికాగానే సాగు భూమిలో విత్తనంతోపాటు కలుపు మొక్కలు రావడంతో మొలకల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి సాగరిక అన్నారు. రైతులకు పంటల సస్యరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వివరించారు. కలుపు మొక్కలు పంట మొక్కలతో సమానంగా భూమి, గాలి, వెలుతురు, నీరు, పోషక పదార్థాలతో పోటీపడి మొక్కలకు చాలా నష్టం కలిగిస్తాయన్నారు. ఈ దశంలో కలుపును నివారిస్తే మొక్కలు ఏపుగా పెరిగే అవకాశం ఉంటుందన్నారు. విత్తుకోవడం పూర్తయిన తరువాత మొదటి 15 రోజుల నుంచి 45 రోజు, దీర్ఘకాల పంటల్లో 15 రోజుల నుంచి 60 రోజుల వరకు కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయని ప్రధానంగా పంటల తొలి దశలో కలుపు పంట పెరుగుదల దెబ్బతింటుందన్నారు. విత్తుకున్న తరువాత మొదటి నుంచి 8 వారా లు కూలీలతో కలుపు తీయించాలని సూచించారు. యంత్రాలతో తీయడం వల్ల సాలు వరుసల మధ్య తీయవచ్చు కానీ మొక్కల మధ్య కలుపు తీయడం సాధ్యపడదన్నారు. సులువుగా నివారించాలంటే కలుపు మందులు ఉపయోగించాల్సిన అవసరం ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

కలుపు నివారణ మందులు వ్యవసాయ అధికారుల సూచన మేరకు వినియోగించాలి. మోతాదు మించితే పంటలకు నష్టం వాటిల్లే వీలుంది. పత్తిపంటలో కలుపు మొక్కల కారణంగా 40 నుంచి 60 శాతం నష్టం జరుగుతుంది. విత్తన 9 వారాల వరకు పంట చేలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. విత్తిన 45 రోజుల తరువాత అంతరసేద్యం చేయడం వల్ల ఊడలు దెబ్బతిని దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు గమనించాలన్నారు. కలుపు నివారణకు పెండిమిథలిన్, డైక్లోసూలామ్, ఆక్సీఫ్లోరోఫెన్ తదితర మందులు విత్తనాలు విత్తిన 48 గంటల్లోగా పిచికారి చేసుకోవాలి. వెడల్పాటి ఆకుల మాదిరిగా కలుపు ఉంటే ఇమజిలూ ఫైర్ 400 ఎంఎల్ ఎకరానికి విత్తిన 20 రోజుల్లోపు పిచికారి చేసుకోవాలి. గడ్డిజాతి కలుపు నివారణకు క్విజాలపాస్ ఇథైల్ 400 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి విత్తిన 20 రోజుల్లోగా పిచికారీ చేయాలి.

గుంటుకతో..

ఈ పద్ధతిలో అతి తక్కువ ఖర్చుతో కలుపు నివారించవచ్చు. విత్తిన 20, 40, 60 రోజులప్పుడు గుంటుకతో పంటకు గాలి బాగా తగిలి ఏపుగా పెరుగుతుంది. మినుము, పెసర, సోయా తదితర వాటిని అంతర పంటలుగా సాగు చేసుకుంటే కలుపు ఉధృతి తగ్గడమేకాకుండా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని ఏఓ వివరించారు.

జాగ్రత్తలు ఇలా ..

కలుపు మందులు వేసిన, పంట వేసిన 25-30 రోజుల తరువాత పని సామగ్రి ద్వారా అంతరకృషి చేయడం మేలు. కలుపు మందులు సరైన మోతాదులో, సమయంలో వాడాలి. చాలా కలుపు మందులను విత్తనం వేయగానే 24 నుంచి 48 గంటల్లోపు పిచికారి చేయాలి. వరినాట్లు పెట్టిన తరువాత నాలుగు నుంచి ఏడు రోజుల వరకు కలుపు మందులు ఇసుకలో కలిపి చల్లాలి. మెట్టసాగులో కలుపు మందులు పిచికారి చేసుకోవచ్చు. కాని వరిపంటలో మాత్రం ఎకరానికి 15 కిలోల ఇసుకలో కలుపు మందులు కలిపి చల్లుకోవాలి. ఎకరానికి చెప్పిన మందు మోతాదును 240 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏవో వివరించారు.

మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్లకు సన్మానం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట, జూలై 5 : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియామకమైన మార్కెట్ చైర్మన్ పాలాయిశ్రీనివాస్‌ను శుక్రవారం యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ నాయకులు, రేషన్ డీలర్ల సంఘం నాయకులు సన్మానించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్‌ను యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్ ఆధ్వర్యంలో యూత్ నాయకులు కలిసి బొకేను అందజేసి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మోడెం ఎల్లాగౌడ్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రూపిక శ్రావణ్ కుమార్, ములుకల మనీష్, చెన్నారావుపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, న్యాతిని రాంప్రసాద్, పాల్స ప్రశాంత్, ఎదరబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు. అలాగే డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దారావత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో ఖానాపురం మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రవి, నర్సంపేట మండల డీలర్ల సంఘం నాయకులు అనంతుల రాంనారాయణ, సుధాకర్, కొయ్యడి సంపత్ తదితరులు పాలాయి శ్రీనివాస్‌కు శాలువాకప్పి సన్మానించారు.

- చెన్నారావుపేట: నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పాల్వాయి శ్రీనివాస్‌ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, నర్సంపేట మండల ఉపాధ్యక్షుడు గజ్జి రాజు, మండ ల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, మండ ల యూత్ అధ్యక్షుడు బండి హారీష్, కుండె కుమారస్వామి, జోరు వీరయ్యగౌడ్ పాల్గొన్నారు.


హరిబాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబుకు సన్మానం

ఖానాపురం : నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన శాఖమూరి హరిబాబు నియామకం కావడంతో శుక్రవారం మండల కేంద్రంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హరిబాబును శాలువాలతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, ఎలగందుల రాజు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు


స్వాధీనం చేసుకున్న బెల్లాని చూపుతున్న ఎక్సైజ్ సీఐ

వర్ధన్నపేట, జూలై 5 : గ్రామీణ ప్రాంతాల్లోగిరిజన తండాల్లో గుడుంబా తయారు చేసినా, అమ్మడం, కొనడం చేసినా కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప హెచ్చరించారు. శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటుసారాయి, తయారు చేసే ముడి పదార్థాల కోసం పట్టణంలో పలు కిరాణ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో పలు షాపుల్లో 180కిలోల బెల్లం, 250కిలోల చక్కెర, 4కిలో ఈస్ట్ పౌడర్‌ను పట్టుకుని స్వాధీనం చేసుకుని, షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా తయారీ సామగ్రి అమ్మితే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు సరిత, గంగాధర్, సిబ్బంది శ్రీధర్, సీహెచ్ రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తులో పడి జీవితాలను చిత్తు చేసుకోవద్దు

వర్ధన్నపేట రూరల్ : యువకులు మత్తులో పడి జీవితాలను చిత్తు చేసుకోవద్దని వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని బండౌతపురంలో గుడుంబా, గంజాయి, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ 100, సీసీ కెమెరాలు, గుట్కా, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు జల్సాలకు అలవాటుపడి గంజాయి, డ్రగ్స్ బారిన పడి చిన్న వయస్సులోనే ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రజలు గుడుంబాకు దూరంగా ఉండాలని, వాటితో కుటుంబాలు ఛిద్రమై పోతున్నాయని స్పష్టంచేశారు. బాల్య వివాహాలతో భవిష్యత్తు తరాలు ఎంతో ఇబ్బందులు పడతాయని, వాటిని గ్రామస్థులు ప్రోత్సహించకూడదని స్పష్టం చేశారు. వర్ధన్నపేట ఏఎస్ఐ శ్రీనివాస్, పీసీ రమేష్, కళాజాత బృందం ఇన్‌చార్జ్ ఏఎస్ఐ నాగమణి, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, చిరంజీవి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన మాజీ వైస్ ఎంపీపీ



పర్వతగిరి, జూలై 5: వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు అరూరి రమేష్‌ను పర్వతగిరి మాజీ వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు హన్మకొండలోని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో అరూరిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

బురదమయంగా మారిన రోడ్డు


బురదమయమైన అప్పల్‌రావుపేట-గుండ్రపల్లి రహదారి

నెక్కొండ, జూలై 5 : నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట-గుండ్రపల్లి రైల్వే గేటు ప్రధాన రహదారి బురదమయం కావడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు గ్రామాల మధ్య వయా ఎస్సీ కాలనీ నుంచి ఈ దారి గుండ్రపల్లి రైల్వే గేటు వరకూ ఉంది. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న ఈ రోడ్డు గుండ్రపల్లి రైల్వే గేటు వద్ద ఆర్యూబీ నిర్మాణం జరుగుతుండటంతో ఇందుకు సంబంధించి ఈ దారి నుంచి భారీ వాహనాలు వెలుతుండడంతో దారి పూర్తిగా దెబ్బతింది. దీంతో పాదాచారులు అడుగుతీసీ అడుగు వేయడానికి సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, జీపులు కూడా వెళ్లలేక పోతున్నాయి. ఎస్సీ కాలనీ వాసులు రాకపోకల విషయంలో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఈ ప్రాంతంలో వ్యవసాయ సాగు చేసే రైతులు వ్యవసాయ అవసరాలకు సంబంధించిన పనిముట్లను తీసుకుపోవడానికి నరకయాతన పడాల్సి వస్తుంది. సంబంధితాధికారులు స్పందించి దారి మరమ్మతు చేయించడంతో పాటు, భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

పర్వతగిరి, జూలై 5 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, రక్త విరేచనాలు, హెపటైటిస్ బి తదితర రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని, ముందస్తుగా ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. ప్రతీ గర్భిణి స్త్రీ ప్రభుత్వ దవాఖానాలోనే ప్రసవం జరిగేటట్లు చూడాలన్నారు. 30ఏళ్లు పైబడినవారికి పలు రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించాలన్నారు. ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు సమయపాలన పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ కీర్యా, సిబ్బంది పాల్గొన్నారు.

- రాయపర్తి : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సూచించారు. శుక్రవారం రాయపర్తిలోని పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చిన పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ, ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మశ్రీ

దుగ్గొండి, జూలై 5 : మండల కేంద్రంలోని పీహెచ్‌సీని శుక్రవారం జిల్లా మాతశిశు సంక్షేమ అధికారి పద్మశ్రీ సందర్శించి రికా ర్డులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ప్రసవాలు, పిల్లల టీకాలు వివరాలను స్థానిక డాక్టర్ కిరణ్‌రాజును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి లో ప్రసవాల సంఖ్య పెంచాలని, గర్భిణులను గుర్తించి నమోదుచేయాలని, గ్రామా ల్లో టీకాలను పిల్లలకు క్రమం తప్పకుండా వేయాలని ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో హెచ్‌ఈవో సాంబయ్య స్టాప్ నర్సు సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి


రాంధాన్ తండాలో అవగాహన కల్పిస్తున్న కె.కిషన్

వర్ధన్నపేట రూరల్, జూలై 5 : గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యుత్ సరఫరా, వాటి ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ కంపెనీ చీఫ్ జనరల్ మేనేజర్ కె.కిషన్ సూచించారు. శుక్రవారం వరంగల్ సర్కిల్ పరిధిలోని వర్ధన్నపేట సబ్ డివిజన్‌లోని రాంధాన్‌తండా, చంద్రు తండాల్లో పర్యటించారు. తండావాసులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బట్టలు ఆరవేసే జీఐ దండెము వైర్లపై నుండి విద్యుత్ సర్వీస్ వైర్లు వెళ్లడం వలన విద్యుత్ వైర్లలో ఇన్సులేషన్ సరిగ్గా లేకపోవడంతో విద్యుత్ సరఫరా జరిగి షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యుత్ ప్రమాదాలు భద్రతపై నిర్లక్ష్యం, అవగాహన లోపం వలనే జరుగుతున్నాయని స్పష్టంచేశారు. విద్యుత్ వినియోగదారులు గృహాలలో నాణ్యమైన వైరింగ్ చేయించాలని, నాసిరకం పరికరాలు వాడకూడదని, రైతులు స్విచ్ బోర్డు, మోటార్ స్టార్టర్‌ల దగ్గర భద్రత ప్రమాణాలు పాటించాలని, ఎర్తింగ్ లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ భిక్షపతి, ఏడీ కన్న రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వనమహోత్సవాలు


సైనిక్ స్కూల్‌లో వనమహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్డీవో కౌసల్యాదేవి

ఖానాపురం, జూలై 5 : నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని తహసీల్దార్, ఖానా పురం జీపీ ప్రత్యేకాధికారి కిరణ్ కుమార్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో పశువైద్యశాల ఆవరణలో ఖానా పురం జీపీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి సుప్రజ, షఫీ, ఎఫ్ఏ యాకయ్య ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

- చెన్నారావుపేట : వన మహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలునాటాలని ఎంపీడీవో గడ్డం దయాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కందిగడ్డలో పేదరిక నిర్మూలన సంస్థ వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రావు. కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.
- పర్వతగిరి : చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎంపీడీ వో శంకర్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు మంగ్యాతండాలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, ఆర్టీసీ డీఎం పద్మావతి, టీఏ గణేష్, కార్యదర్శులు రఘు, రంజిత్, ఐకేపీ సీసీలు కాంతయ్య, రమాదేవి, ఎఫ్ఏలు లింగమూర్తి, యుగేందర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.
- గీసుగొండ : మండలంలో వన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీల్లో 13,500 మొక్కలను నాటినట్లు ఏపీఎం చంద్ర కాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్‌కుమార్, జీపీ ప్రత్యేక అధికారులు డాక్టర్ రమేష్, ప్రభాకర్, కార్యదర్శులు, అటవీశాఖ అధికారులు అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు. మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

• సామూహిక వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఖానాపురం : నేడు అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో నిర్వహించనున్న సామూహిక వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్డీవో కౌసల్యాదేవి, కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. అశోక్‌నగర్ సైనిక్ స్కూల్‌లో నిర్వహించనున్న సామూహిక వనమహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఏక కాలంలో 1500 మొక్కలు నాటే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే మాధవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఏపీఎం కందిక సుదాకర్, ఏపీవో సునీత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, ఎల్డి శ్రీనివాస్, గట్టి సారంగపాణి, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా ఉష

నెక్కొండ, జూలై 5 : నెక్కొండ ఎంపీడీవో కార్యాలయం ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉష శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం నెక్కొండ మండల ప్రత్యేకాధికారిగా కూడా విధులను నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కె.వీరేశ్, సిబ్బంది ప్రత్యేకాధికారిగా బాధ్యతలను చేపట్టిన ఉషను శాలువాతో సన్మానించారు.

రైస్ మిల్లులో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


రైస్ మిల్లులో స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

వర్ధన్నపేట రూరల్, జూలై 5 : మండలంలోని ఇల్లందలో లక్ష్మీశ్రీ గణపతి ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ములుగు డీఎం డీసీఎస్‌వో రాంపత్రి, మహబూబాబాద్ డీఎం సీఎస్ కృష్ణవేణి, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్ సాగర్, వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వం అందించిన టార్గెట్‌మేరకు రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. రికార్డులను తనిఖీచేసి పూర్తి సమాచారాన్ని తెలుసుకున్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

వర్ధన్నపేట, జూలై 5 : బీజేపీ యువమోర్చా పిలుపు మేరకు నిరుద్యోగ సమస్యలపై జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి తరలివెళ్లేందుకు సిద్ధమైన బీజేవైఎం, ఏబీవీపీ నాయకులను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్ట్‌చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జడ సతీష్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో నిరుద్యోగ సమస్య తీరుతుందని భావించిన యువతకు బీఆర్ఎస్ మొండిచేయి చూపిందని అదే రీతిలో కాంగ్రెస్ పార్టీ సైతం వ్యవహరిస్తుండడం సిగ్గు చేటన్నారు.

- నర్సంపేట టౌన్ : గ్రూప్ పోస్టుల సంఖ్య పెంపుతో పాటు జాబ్ క్యాలెండర్, జీవో 46రద్దు తదితర డిమాండ్లతో నిరుద్యోగులు శుక్రవారం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో నిరుద్యోగులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నర్సంపేట పోలీసులు బీజేవైఎం నాయకులు జూలూరి మనీష్‌గౌడ్, కొంకీస విష్ణుగౌడ్, భవాని శంకర్, ఆకాష్, అన్వేష్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ఎస్ఎస్ఎఫ్ నాయకుడు ధరావత్ సుభాష్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకులను అరెస్టు చేసి వ్యక్తిగతపూచికత్తుపై విడుదల చేశారు.

విశ్వఖర్మ ఖ్యాతిని పెంచాలి

సంగెం, జూలై 5: విశ్వఖర్మ ఖ్యాతిని పెంచేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని విశ్వఖర్మ జిల్లా అధ్యక్షుడు బండ్లోజు నర్సింహచారి, మండల శాఖ అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారిలు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఇటీవల తాజామాజీ ఎంపీటీసీ సుతారి బాలకృష్ణకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి రాచమల్ల కోదండరాములు, కోశాధికారి సదాశివుడు పాల్గొన్నారు.